క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణా నికి చెందిన రాయపురెడ్డి శంకర్, కృష్ణ రూ.50,121 విరాళం ఇచ్చారు. పట్టణంలోని వారి నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, దాసరి రవి, దిలీప్‌కుమార్, గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.లకు గురువారం నగదు అందజేశారు. ట్రస్టు సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి సహాయం



బాధితురాలికి డిపాజిట్ ఫారం అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: స్థానిక రుంకానవీధికి చెందిన పిల్ల వరలక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు తాడివాక బిందు రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. బాధితురాలు ఖాతాలో నగదు జమ చేసి, సంబంధిత డిపాజిట్ ఫారంను పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ గురువారం ఆమెకు అందజేశారు.

సెమీ క్రిస్మస్ సంబరాలు



రగ్గులు,ప్లాస్కులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

గజపతినగరం: స్థానిక డీఎస్‌ఏ తెలుగు బాప్టిస్టు చర్చిలో మండల పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు ఏ.కృపారావు ఆధ్వర్యంలో గురువారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పాస్టర్లు అంతా కలిసి కేక్ కట్ చేశా రు. అంతకుముందు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 50 మంది పేద క్రీస్తు విశ్వాసకులకు రగ్గులు, ప్లాస్కులు, గ్లాసులు పంపిణీ చేశారు. సీనియర్ పాస్టర్లను సత్కరించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కన్వీనర్ ఎం.ఆశాజాన్, మండల వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కన్వీనర్ ఏ.చంద్రశేఖర్, పాస్టర్లు డానియల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై సర్వే



చెరువు వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో సర్వే నంబర్ 81లో ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణలపై తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, మండల సర్వేయర్ గ్రంధి రామం ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. గతంలో ఓవ్యక్తి తన మామిడితోటకు వెళ్లేందుకు చెరువు గట్టును తవ్వేసి రోడ్డు వేసుకునేందుకు ప్రయత్నించారు. ఈవిషయంపై గతనెల 15వ తేదీన 'చెరువు గట్టు తవ్వేసి రోడ్డు నిర్మాణం' పేరిట సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఎట్టకేలకు అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలపై సర్వే చేశారు. చెరువు గట్టును, గర్భాన్ని కొలిచారు. రోడ్డు నిర్మాణానికి సుమారు 6 సెంట్ల చెరువు గర్భాన్ని ఆక్రమించినట్లు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. ఆక్రమణదారుడికి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: మండలంలోని మరుపల్లి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులు సోకిల సన్యాస ప్పడు, కొండమ్మల కుమార్తె రమాదేవి ఎస్.కోట లోని వివేకానంద విద్యాసంస్థల్లో ఇంటర్ చదువుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు రమాదేవి కుటుంబానికి అండగా నిలిచారు. రూ.37,000 నగదు, దుస్తులు గురువారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వస్తున్నాం...

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు నియోజకవర్గంలో గడప గడపకూ వస్తున్నామని, ఇది చరిత్రలో ఎప్పుడైనా సాధ్యమైందా అని ఎమ్మె ల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను ప్రశ్నించారు. గురువారం సాయంత్రం మండలంలోని ఖర్తాపురం ఎస్టీ కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు , సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సేవ లపై ఆరా తీశారు. ప్రతీ కుటుంబానికి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించి, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సందే శంతో కూడిన బ్రోచర్‌ను అందజేశారు. పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ అములు చేస్తున్న పథకాలు యథాతథంగా అందాలంటే చంద్రబాబు అండ్ కంపెనీని మరోమారు అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు. పేదల కోసం పని చేసే ముఖ్యమంత్రి జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు మోపాడ కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి వాకాడ సతీష్, మాజీ జెడ్పీటీసీ సుకురు రామలక్ష్మి, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, ఎంపీటీసీ సన్యాసప్పడు, మండల నాయకులు వాకాడ రాంబాబు, డేగల అచ్యుతరావు, మైసాల అప్పన్నదొర, జుత్తాడ రమణ, దాలినాయుడు, కేత వీరన్న, రంది అనంత్, ఆవాల కృష్ణ, చింతల నారాయణమూర్తి, ఎడ్ల నాయుడు, కాండ్రేగుల నర్సింగరావు, వేములాపల్లి రాము, ఎలమంచిలి రాంబాబు, నాగరాజు, అప్పలసత్యం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

23లోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి



పంచాయతీ కార్యదర్శులు, పీడీలతో సమావేశమైన ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: 'ఆడుదాం- ఆంధ్రా' క్రీడాపోటీల్లో పాల్గొనే వారి వివరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 23వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పీడీలతో గురు వారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రతీ పంచాయతీ పరిధిలో 225 మందికి తక్కువ కాకుండా రిజిస్ట్రేషన్‌లు చేయాలన్నారు. మండలంలో 3,600 మంది అయిదు రకాల క్రీడా పోటీల్లో పాల్గొనేలా లక్ష్యం పెట్టుకోగా ఇంత వరకు కూడా 2,040 మంది రిజి స్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మండలంలో ఎనిమిది మైదానా ల్లో ఈనెల 26న పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏఈఓలు శోభారాణి, ఎ.వెంకటరమణ,పీడీలు ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా' రిజిస్ట్రేషన్ల గడువు పెంపు

చీపురుపల్లి:మండలంలో నిర్వహించనున్న 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ గడువును ప్రభుత్వం పొడిగించిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల17 వరకు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, 26 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల తుఫాన్ కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరిగిందని, కోస్టల్ ప్రాంతంలో ఉన్న జిల్లాల నుంచి ప్రభుత్వానికి వెళ్లిన విజ్ఞప్తి మేరకు రిజిస్ట్రేషన్ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.

పుణ్యగిరి ఆదాయం రూ.3,24,307

శృంగవరపుకోట: కార్తీకమాసంలో స్థానిక పుణ్యగిరి దేవస్థానానికి వచ్చిన హుండీల ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కించారు. రూ.3,24,307 ఆదాయం వచ్చినట్లు ధృవీకరించారు. దేవదాయశాఖ ఈఓలు కె.ఆది నారాయణ, కె.నాగేంద్ర, దేవస్థానం బోర్డు ఛైర్మన్ పి.రామకృష్ణ, సభ్యులు, దేవదాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

చీపురుపల్లి: హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ డీజీఎం సుందర్‌వదన్ అన్నారు. పట్టణంలోని శివరాం రోడ్ జంక్షన్‌లో హెచ్‌పీ గ్యాస్ నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అన్ని పథకాల ద్వారా వినియోగదారులకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తామన్నారు. గ్యాస్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ సేల్స్ ఆఫీసర్ శ్రీహర్ష, డిస్ట్రిబ్యూటర్లు మీసాల బాలు, వరహాలనాయుడు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామ రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్‌కు రంగు మారిన ధాన్యాన్ని సైతం గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వ మే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రైతులకు అవసరమైన గోనెలు సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. సర్పంచ్‌లు కొట్యాడ దేవి, కొయ్యా న కృష్ణ, ఏట స్వాతికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్యాడ మహేష్, ఎర్రా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొట్యాడ జగన్ పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగించుకోండి



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

గుర్ల: ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను 55 శాతం నుంచి 90 శాతం రాయితీపై అందిస్తోందని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలని మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని పాలవలసలో రైతులకు రాయితీపై అందించిన డ్రిప్ పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయ వచ్చని చెప్పారు. డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యావన శాఖ అధికారి శ్రీనివాసు, వీఏఏ సంగమేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అన్ని వర్గాలకూ మేలు చేశాం



వేపాడ: శింగరాయిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



శృంగవరపుకోట : మూలబొడ్డవరలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



గంట్యాడ: వసాదిలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



దత్తిరాజేరు: పాచలవలసలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు వివిధ పథకాల ద్వారా మేలు జరిగిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండ లంలోని మూల బొడ్డవర గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.28.23 కోట్లతో చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను మండల నాయ కులతో కలిసి ఎగురవేశారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ఇంటింట ప్రచారం చేశారు.వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వేపాడ ఎంపీపీ డి.సత్య వంతుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి వాకాడ సతీష్, నాయకులు కె.వెంకట రావు, ఎస్.చంద్రరావు, ఆవాల కృష్ణ, చింతల నారాయణమూర్తి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

వేపాడ: అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ సత్యవంతుడు, డీసీసీబీ ఛైర్మన్ చినరామునాయుడు అన్నారు. మండలంలోని శింగరాయి గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్క రించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి, ఇంటింట ప్రచారం చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, ప్రాంతీయ జోనల్ కన్వీనర్ ఎం.సత్యనారాయణ ఎంపీటీసీ టి.వి.రమణ పాల్గొన్నారు.

వసాదిలో...

గంట్యాడ: మండలంలోని వసాది గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన

దత్తిరాజేరు: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు.గురువారం సాయంత్రం పాచలవలస గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామ సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా ప్రజలకు రూ.28.50 కోట్లతో పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ సుమల శ్యామల, ఎంపీటీసీ పాలూరి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులు, మిల్లర్లకు ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మండలంలోని మిల్లర్లతో పాటు, వీఏఏలు, సివిల్ సప్లయ్ అధికారులతో ధాన్యం సేకరణపై స్థానిక మండ ల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు మిల్లుల నుంచి 9,600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడానికి అనుమతులు వచ్చాయని చెప్పారు. మండలంలో ధాన్యం సేకరణకు 3.62 లక్షల గోనె సంచులు అవసరం కాగా ప్రసుత్తానికి ప్రతీ మిల్లుకు 10 వేల చొప్పున వచ్చాయని పేర్కొన్నారు. రంగు మారిన ధాన్యంకు సంబంధించి ప్రత్యేక ధరను ప్రభుత్వం నిర్ణయించి సేకరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. మండలంలో 500 ఎకరాల్లో వరి పంట తుఫాన్ వర్షాలకు పూర్తిగా తడిసిపోయినట్లు గుర్తించామని చెప్పారు.ఏఓ పి.వి.మల్లికార్జునరావు, సివిల్ సప్లయ్ డీటీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్



విజేత దెందేరు జట్టుకు ట్రోఫీ, లక్షరూపాయల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

- విజేత జట్టుకు లక్షరూపాయల నగదు బహుమతి

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గురు వారంతో ముగిసింది. 41 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఫైనల్స్‌కు దెందేరు, ఒడ్డిపేట జట్లు చేరగా... దెందేరు విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,శారద కర్మాగారం సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత్‌మోహన్‌తో కలిసి విజేత జట్టు దెందేరుకు లక్ష రూపాయల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఒడ్డిపేట జట్టుకు రూ.50 వేలు,తృతీయ స్థానంలో నిలిచిన కొత్తవలస జట్టుకు రూ.12 వేలు, నాలుగోస్థానంలో నిలిచిన రాయపురాజుపేట జట్టుకు రూ.10వేల నగదు బహుమతి, మెడల్స్ అందజేశారు.అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు ఒక నెట్, రెండు వాలీబాల్స్ చొప్పున పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వంపెద్దపీట వేస్తోందని,క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం-ఆంధ్రా'పేరిట క్రీడా టో ర్నమెంట్ నిర్వహిస్తోందని చెప్పారు. ఈక్రీడా పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపుని చ్చా రు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, కర్మాగార ప్ర తినిధులు సన్యాసిరావు, జి.శంకరరావు, కోచ్ ఎం.కృష్ణంరాజు,జాతీయ రిఫరీ ఎల్.జి.ఎస్.కుమార్, పీడీలు బాల, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీసీబీ సైంటిస్టుగా చైతన్య



సీపీసీబీ సైంటిస్టుగా ఎంపికైన పాదిలాపు చైతన్య

చీపురుపల్లి: సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) సైంటిస్టు-బిగా పట్టణానికి చెందిన పాదిలాపు చైతన్య ఎంపికయ్యాడు. చైతన్య ఇప్పటికే సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ)లో ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తూనే మరోవైపు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు-2023 జూన్ నెలలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు హాజరై ఎంపికయ్యాడు. చైతన్య తండ్రి పాదిలాపు వెంకటరావు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. చైతన్యకు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు అభినందనలు తెలిపారు.

పశు ఆరోగ్యసంరక్షణ కార్డుల అందజేత



పాడిరైతులకు పశు ఆరోగ్యసంరక్షణ కార్డులు అందజేస్తున్న వైద్యాధికారి దినేష్,నాయకులు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో పెదమానాపురం పశు వైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో పశువులకు గురు వారం వైద్యపరీక్షలు చేసి, పాడిరైతులకు వైఎస్సార్ పశు ఆరోగ్యసంరక్షణ కార్డులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆవులు, గేదెలు, మేకలు,గొర్రెలకు వైద్య పరీక్షలు చేయించాలని పాడిరైతులకు సూచించారు. వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, నాయకులు గర్భాపు శ్రీను,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన అధికారులు



గంట్యాడ: కొర్లాం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపిస్తున్న సీడీపీఓ ఉమాభారతి

గంట్యాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేపడతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. లబ్ధిదారులకు అందించే సేవల్లో ఆటంకం కలగరాదని భావించిన అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తెరిపించారు. ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది కొర్లాం, గింజేరు, పెంటశ్రీరాంపురం, పెదమజ్జిపాలెం, గంట్యాడ తదితర గ్రామాల్లోని కేంద్రాల తాళాలను విరగొట్టి తెరిపించారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ ఎం.రత్నం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం సాయంత్రం తాళం విరగ్గొట్టి తెరిచారు. కేంద్రాలను మహిళా వలంటీర్లతో నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసనాయుడు, తదితరులు

గజపతినగరం: నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాసనాయుడు సూచించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' పేరిట గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు,ఆయన ఆశయాలను పల్లె పల్లెకూ తీసుకువెళతున్నామని వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, రాష్ట్ర నాయకుడు పల్లా వెంకటరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దంతినాడ అప్పలాచారి, సంకల్ప ఫౌండేషన్ ఛైర్మన్ అయ్యగారి కామేష్, దత్తిరాజేరు మండల నాయకుడు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.